మహాయుతిదే మహా పీఠం!

జార్ఖండ్‌లో ఎన్డీయేకి ఎడ్జ్ • కాంగ్రెస్ కూటమికి భంగపాటే! • అంచనా వేసిన ఎగ్జిట్ పోల్స్

తమ సర్కారు ప్రగతి నివేదికను విడుదల చేస్తున్న మహాయుతి నేతలు (ఫైల్)

న్యూఢిల్లీ, నవంబర్ 20: మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీలకు బుధవారం పోలింగ్ పూర్తయిన కొద్దిసేపటికే ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు వెల్లడయ్యాయి. ఇందులో చాలా సంస్థలు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమే రెండు రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తుందని అంచనా వేశాయి. అయితే యాక్సిస్ మై ఇండియా సంస్థ ఒక్కటే కాంగ్రెస్-జేఎంఎం కూటమి జార్ఖండ్‌లో 53 సీట్లు దక్కించుకుంటుందని పేర్కొంది. ఇక్కడ బీజేపీ కూటమి 25 సీట్లకే పరిమితమవుతుందని అంచనా వేసింది. 288 సీట్లున్న మహారాష్ట్ర అసెంబ్లీలో అధికారం చేపట్టడానికి మ్యాజిక్ ఫిగర్ 145. అలాగే 81 సభ్యులున్న జార్ఖండ్‌లో మ్యాజిక్ ఫిగర్ 41. ప్రస్తుతం మహారాష్ట్రలో బీజేపీ-శివసేన-ఎన్సీపీ కూటమితో కూడిన మహాయుతి అధికారంలో ఉండగా, కాంగ్రెస్-శివసేన (యూబీటీ), ఎన్సీపీ (శరద్‌పవార్)లతో కూడిన మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) విపక్షంగా ఉంది. జార్ఖండ్‌లో జేఎంఎం-కాంగ్రెస్ కూటమి రాష్ట్రాన్ని పాలిస్తున్నది. పోల్ ఆఫ్ ఎగ్జిట్ పోల్స్ ప్రకారం.. మహారాష్ట్రలో మహాయుతి తిరిగి అధికారాన్ని నిలబెట్టుకోనుంది. జార్ఖండ్‌లో హోరాహోరీ పోరు నెలకొననున్నది.

అధికారాన్ని నిలుపుకోనున్న మహాయుతి!

వెలువడిన మొత్తం 9 ఎగ్జిట్ పోల్స్‌లో మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి అధికారాన్ని నిలబెట్టుకుంటుందని నాలుగు సంస్థలు అంచనా వేశాయి. మూడు సంస్థలు మాత్రం హంగ్ ఏర్పడుతుందని పేర్కొనగా, రెండు సంస్థలు హోరాహోరీ పోరు ఉంటుందని తెలిపాయి. ఇక పోల్ ఆఫ్ ఎగ్జిట్ పోల్స్ అంచనా ప్రకారం.. మహారాష్ట్రలో మహాయుతి కూటమికి 150 సీట్లు, మహావికాస్ అఘాడీ కూటమికి 125 సీట్లు రానున్నాయి.

జార్ఖండ్‌లో నువ్వా నేనా?

జేఎంఎం నేతృత్వంలోని ఇండియా కూటమి అధికారంలో ఉన్న జార్ఖండ్‌లో హోరాహోరీ పోరు నెలకొన్నట్టు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. పోల్ ఆఫ్ ఎగ్జిట్ పోల్స్ ప్రకారం.. ఎన్డీయేకు 39, ఇండియా కూటమికి 38 సీట్లు రానున్నాయి. 81 సీట్లున్న జార్ఖండ్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు 41 సీట్లు అవసరం. కాగా, యూపీలో 9 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో 7 స్థానాలను బీజేపీ కూటమి గెల్చుకుంటుందని పలు సంస్థలు అంచనా వేశాయి.

ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు-మహారాష్ట్ర

	మొత్తం సీట్లు 288	మ్యాజిక్ ఫిగర్ 145	
సర్వే సంస్థ	మహాయుతి	ఎంవీఏ	ఇతరులు
చాణక్య స్ట్రాటజీస్	152-160	130-138	6-8
దైనిక్ భాస్కర్	125-140	135-150	20-25
ఎలక్టోరల్ ఎడ్జ్	118	150	20
లోక్‌షాహి మరాఠి	128-142	125-140	18-23
మాట్రిజ్	150-170	110-130	8-10
పీ-మార్క్	137-157	126-146	2-8
పీపుల్స్ పల్స్	175-195	85-112	7-12
పోల్ డైరీ	122-186	69-121	10-27
టైమ్స్ నౌ-జేవీసీ	150-167	107-125	13-14
పోల్ ఆఫ్ పోల్స్	150	125	13

ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు-జార్ఖండ్

	మొత్తం సీట్లు 81	మ్యాజిక్ ఫిగర్ 41	
సర్వే సంస్థ	ఎన్డీఏ	ఇండియా	ఇతరులు
యాక్సిస్ మై ఇండియా	17-27	49-59	1-6
చాణక్య స్ట్రాటజీస్	45-50	35-38	3-5
దైనిక్ భాస్కర్	37-40	36-39	0-2
ఎలక్టోరల్ ఎడ్జ్	32	42	7
మాట్రిజ్	42-47	25-30	1-4
పీ-మార్క్	31-40	37-47	1-6
పీపుల్స్ పల్స్	44-53	25-37	5-9
టైమ్స్ నౌ-జేవీసీ	40-44	30-40	1-1
పోల్ ఆఫ్ పోల్స్	39	38	4

మహారాష్ట్రలో 60% పోలింగ్

- జార్ఖండ్‌లో 68% ఓటింగ్
- ఈ నెల 23న ఓట్ల లెక్కింపు

ముంబై, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ)/ రాంచీ: మహారాష్ట్ర, జార్ఖండ్ శాసనసభ నియోజకవర్గాలకు బుధవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మహారాష్ట్రలో ఒకే విడతలో జరిగిన పోలింగ్‌లో 60 శాతం ఓటింగ్ నమోదైంది. 2019 ఎన్నికల్లో నమోదైన 61.74 శాతం కన్నా ఇది స్వల్పంగా తక్కువ. 288 స్థానాలకు జరిగిన ఈ ఎన్నికల్లో గడ్చిరోలి జిల్లాలో అత్యధికంగా 69.63%ఓటింగ్ నమోదైంది. నాందేడ్ లోక్‌సభకు జరిగిన ఉప ఎన్నికలో 53.78% నమోదైంది.

జార్ఖండ్‌లో..

జార్ఖండ్‌లో బుధవారం 38 స్థానాలకు జరిగిన రెండో, ఆఖరి విడత ఎన్నికలలో సాయంత్రం 5 గంటలకు 68 శాతం ఓటింగ్ నమోదైంది. ఇది 2019 ఎన్నికల శాతం (67.04) కన్నా స్వల్పంగా అధికం. జంతార జిల్లాలో అత్యధికంగా 76.16%, బొకారో జిల్లాలో అత్యల్పంగా 60.97% పోలింగ్ నమోదైంది. ఇక్కడ మొదటి విడత ఎన్నికలు నవంబర్ 13న జరిగాయి. ఓట్ల లెక్కింపు 23న జరుగుతుంది.

అంతరిక్షంలోకి అరటిపండు!

భారీ రాకెట్ ద్వారా పంపిన 'స్పేస్ ఎక్స్' సంస్థ



న్యూఢిల్లీ, నవంబర్ 20: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన 'స్పేస్ ఎక్స్' సంస్థ బుధవారం ఓ భారీ రాకెట్ ప్రయోగాన్ని నిర్వహించింది. చంద్రుడి పైకి వ్యోమగాములను, అంగారక గ్రహంపైకి సిబ్బందిని చేర్చేందుకు డిజైన్ చేసిన 400 అడుగుల పొడవైన 'స్టార్ షిప్' రాకెట్‌ను దక్షిణ టెక్సాస్‌లోని స్టార్ బేస్ కేంద్రం నుంచి ప్రయోగించింది. ఈ ప్రయోగంలో బహుళ ప్రయోజనార్థం వ్యూహాత్మకంగా ఓ అరటిపండును నింగిలోకి పంపింది. జీరో-గ్రావిటీ ఇండికేటర్ (శూన్య గురుత్వాకర్షణ సూచీ)లా పనిచేయడం ఈ అరటిపండు పోషించాల్సిన ప్రధాన పాత్ర. వ్యోమనౌక సూక్ష్మ గురుత్వాకరణ (మైక్రోగ్రావిటీ)లోకి ప్రవేశించినప్పుడు ఆ విషయాన్ని దృశ్యమానంగా ప్రదర్శించేందుకు రోదసి యానంలో ఓ చిన్న వస్తువును ఉపయోగించడం సంప్రదాయమే. వ్యోమనౌక అంతరిక్షంలోకి చేరుకున్న క్షణాన్ని పరిశీలకులు సులభంగా గుర్తించేందుకు వీలు కల్పించే ఈ పద్ధతి ఎంతో సరళమైనది, ప్రభావవంతమైనది. కానీ, స్టార్‌షిప్ రాకెట్‌లో అరటిపండును పంపడం సంప్రదాయానికి మించిన చర్య. కార్గో పరీక్షలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని చాటుకోవడంతోపాటు ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) విభాగంతో సాన్నిహిత్యాన్ని పెంపొందించుకునేందుకు, తద్వారా మున్ముందు రోదసిలోకి పంపే పేలోడ్‌లకు త్వరగా ఆమోదాన్ని పొందేందుకు, 'స్పేస్ ఎక్స్' సంస్థ ఈ సంప్రదాయేతర పేలోడ్ (అరటిపండు)ను ఉపయోగించింది.

ప్రపంచ ఉత్తమ నగరం 'లండన్'

టాప్-100లో చోటు దక్కించుకోని భారత నగరాలు

లండన్ : వరల్డ్ బెస్ట్ సిటీస్-2025లో 'లండన్ నగరం' టాప్‌లో నిలిచింది. లండన్ తర్వాత న్యూయార్క్, పారిస్, టోక్యో, సింగపూర్, రోమ్.. టాప్-10లో ఉన్నాయి. నివాస యోగ్యత, సంస్కృతి, నగరంలో రాత్రి జీవితం మొదలైనవి పరిగణనలోకి తీసుకొని ఉత్తమ నగరాల ఎంపిక జరిగిందని ర్యాంకింగ్స్ విడుదల చేసిన 'రిసోనెన్స్ కన్సల్టెన్సీ' తెలిపింది. కాగా టాప్-100 సిటీస్‌లో భారతీయ నగరాలేవీ లేకపోవటం గమనార్హం. ముంబై, ఢిల్లీ నగరాలకు కూడా ర్యాంకింగ్స్‌లో చోటు దక్కలేదు. '31 దేశాల్లో 22వేల మందిని సర్వే చేశాం. నివాస యోగ్యమైనవిగా ముంబై, ఢిల్లీ నగరాలకు కొన్ని అనుకూలతలు ఉన్నాయి. కానీ ప్రపంచ స్థాయిలో ఈ నగరాలు టాప్-100లో లేవు' అని 'రిసోనెన్స్ కన్సల్టెన్సీ' అధ్యక్షుడు, సీఈవో క్రిస్ ఫెయిర్ అన్నారు.

12 రోబోలను కిడ్నాప్ చేసిన మరో రోబో

చైనాలో ఘటన

న్యూఢిల్లీ: రోబోలూ నేరాలకు పాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. కృత్రిమ మేధ (ఏఐ) సామర్థ్యం గల ఓ చిన్న రోబో 12 పెద్ద రోబోలను కిడ్నాప్ చేయడం కలవరపరుస్తున్నది. ఒడిటీ సెంట్రల్ కథనం ప్రకారం, చైనాలో హాంగ్‌ఝూ మాన్యుఫ్యాక్చరర్ తయారు చేసిన ఎర్బాయ్ రోబోకు ఏఐ సామర్థ్యం ఉంది. ఇది షాంఘై రోబోటిక్స్ కంపెనీ షోరూమ్‌లోకి వెళ్లి అక్కడి భారీ రోబోలను మాటల్లోకి దింపింది. ''నాకు విశ్రాంతి లేదు'' అని ఓ పెద్ద రోబో చెప్పింది. అందుకు ఎర్బాయ్ బదులిస్తూ, ''అంటే, నువ్వు ఇంటికెళ్లడం లేదన్నమాట!'' అంది. ఆ పెద్ద రోబో స్పందిస్తూ, ''నాకు ఇల్లు లేదు'' అంది. ఎర్బాయ్ ఇదే అదునుగా ''అయితే నాతో మా ఇంటికి రా'' అంది. వెంటనే షోరూం నుంచి బయటకు వెళ్లింది. దానితోపాటు 12 పెద్ద రోబోలు వెళ్లాయి. ఈ వీడియో బూటకమని కొందరు కొట్టిపారేశారు. కానీ షాంఘై, హాంగ్‌ఝూ కంపెనీలు ఇది నిజమైన కిడ్నాప్ అని, బూటకం కాదని ప్రకటించాయి. పెద్ద రోబోల సిస్టమ్స్‌లో ఉన్న భద్రతా లోపాన్ని ఎర్బాయ్ గుర్తించి, వాటి చర్యలపై నియంత్రణను సాధించిందని తెలిపాయి.

ఫిబ్రవరి 15 నుంచి సీబీఎస్ఈ

10, 12 తరగతుల ఫైనల్ పరీక్షలు

డేట్‌షీట్ విడుదల చేసిన బోర్డు

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్వహించే 10, 12 తరగతుల ఫైనల్ పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి ప్రారంభమవుతాయి. పదో తరగతి పరీక్షలు మార్చి 18తోనూ, పన్నెండో తరగతి పరీక్షలు ఏప్రిల్ 4తోనూ ముగుస్తాయి. ఈ మేరకు సీబీఎస్ఈ బుధవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రెండు సబ్జెక్టుల పరీక్షల తేదీల మధ్య తగినంత వ్యవధిని ఇచ్చినట్లు తెలిపింది. విద్యార్థి ఎంచుకున్న రెండు సబ్జెక్టుల పరీక్షలు ఒకే రోజు రాయవలసిన అవసరం రాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించింది. 86 రోజుల ముందు ఈ షెడ్యూలును ప్రకటించడం ఇదే తొలిసారి.

ప్రసార భారతి ఓటీటీ యాప్ 'వేవ్స్' ఆవిష్కరణ

న్యూఢిల్లీ: ప్రభుత్వ బ్రాడ్‌కాస్టర్ ప్రసార భారతి బుధవారం తన ఓటీటీ యాప్ 'వేవ్స్'ను ఆవిష్కరించింది. దీని ద్వారా యూజర్లు దూరదర్శన్, ఆకాశవాణి ఆర్కైవ్స్‌ను వీక్షించవచ్చు, వినవచ్చు. అదేవిధంగా 40 లైవ్ టీవీ చానల్స్‌ను కూడా పొందవచ్చు. బీ4యూ, ఏబీజెడ్‌ఐ, ఎస్ ఏబీ గ్రూప్, 9ఎక్స్ మీడియా, ఇండియా టుడే, న్యూస్ నేషన్, రిపబ్లిక్ టీవీ, ఏబీపీ న్యూస్, న్యూస్ 24, ఎన్‌డీటీవీ ఇండియా వంటివాటిని చూడవచ్చు. గోవాలో ప్రసార భారతి చైర్మన్ నవనీత్ కుమార్ సెహగల్ విలేకర్లతో మాట్లాడుతూ, కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందించగలిగే కార్యక్రమాలను వేవ్స్ ద్వారా అందజేయడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

2050 నాటికి దేశంలో 35 కోట్ల చిన్నారులు

యూనిసెఫ్ అంచనా

న్యూఢిల్లీ: భారత్‌లో 2050 నాటికి 35 కోట్ల మంది చిన్నారులుంటారని, వారు తీవ్ర వాతావరణ, పర్యావరణ ప్రమాదాలు ఎదుర్కోవాల్సి వస్తుందని యూనిసెఫ్ నివేదిక పేర్కొంది. వారి హక్కులు, భవితను రక్షించడానికి ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే విధానాలను ప్రభుత్వాలు రూపొందించాలని సూచించింది. 2050 నాటికి ప్రపంచ పిల్లల జనాభాలో 15 శాతం భారత్, చైనా, నైజీరియా, పాకిస్థాన్‌లోనే ఉంటారని తెలిపింది. 'మారుతున్న ప్రపంచంలో పిల్లల భవిత' పేరిట బుధవారం ఈ నివేదికను విడుదల చేసింది. జనాభాలో మార్పులు, వాతావరణ సంక్షోభాలు, కొత్త సాంకేతికతలు అనే ధోరణులు పిల్లల జీవితాలను పునర్ నిర్మిస్తాయని తెలిపింది. భారత చిన్నారులు ముఖ్యంగా గ్రామీణ, మధ్య ఆదాయ వర్గాలవారు తీవ్రమైన వేడి, వరదలు, వాయు కాలుష్య ప్రమాదాల బారిన పడతారని చెప్పింది.

కేంబ్రిడ్జ్ వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా 'మ్యానిఫెస్ట్'

న్యూఢిల్లీ: 'మ్యానిఫెస్ట్(manifest)' పదం ఈ ఏడాది కేంబ్రిడ్జ్ నిఘంటువు 'వర్డ్ ఆఫ్ ది ఇయర్'గా ఎన్నికైంది. ఈ ఏడాది 130,000 సార్లు ఈ పదం కోసం కేంబ్రిడ్జ్ డిక్షనరీ వెబ్‌సైట్‌లో వెతుకులాట జరిగింది. సోషల్ మీడియాలో ఈ పదం చాలాసార్లు ప్రస్తావనకు వచ్చింది. ఈ పదానికి ఉన్న క్రియ అర్థం 'ఒక విషయాన్ని సంకేతాలు, చర్యలు ద్వారా స్పష్టంగా చూపించడం'. అయితే ఈ పదాన్ని ఈ ఏడాది పదంగా ఎన్నుకోవడానికి కారణం దీని కొత్త అర్థం. 'టు మ్యానిఫెస్ట్' పదాన్ని 'నువ్వు కోరుకున్నది సాధించాలని ఊహించడం, ఆ విధంగా నమ్మకంతో దాన్ని చేయడం వల్ల అది సంభవించేలా చేయడం' అనే అర్థంలో వాడుతున్నారు.

ఒక్కో బందీ విడుదలకు 5 మిలియన్ డాలర్ల రివార్డు

హమాస్‌కు నెతన్యాహూ ఆఫర్

గాజా: ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ మంగళవారం గాజా పట్టణాన్ని సందర్శించారు. అరుదైన తన పర్యటనలో ఆయన మాట్లాడుతూ ఇక గాజాను హమాస్ ఎన్నడూ తిరిగి పరిపాలించ లేదని స్పష్టం చేశారు. బందీగా ఉన్న ప్రతి ఒక్కరికీ ఆయన 5 మిలియన్ డాలర్ల రివార్డు ప్రకటించారు. పాలస్తీనా ఉగ్రవాద సంస్థను అంతం చేయడానికి మరోసారి ప్రతిజ్ఞ చేసిన ఆయన ఇజ్రాయెల్ దళాలు ఇప్పటికే హమాస్ సైనిక సామర్థ్యాలను దెబ్బతీశాయని చెప్పారు. ఇక హమాస్ తిరిగి రాబోదని స్పష్టం చేశారు. గాజాలో బందీలుగా ఉన్న 101 మంది ఇజ్రాయెల్ పౌరుల కోసం తమ గాలింపు కొనసాగుతున్నదని చెప్పారు. 'బందీగా ఉన్న వారిని అప్పగిస్తే ప్రతి ఒక్కరికీ 5 మిలియన్ డాలర్ల బహుమతి ఇస్తాం. మీదే నిర్ణయం. అయితే ఎట్టి పరిస్థితుల్లో బందీలనందరినీ సురక్షితంగా వెనక్కి తెస్తాం' అని ఆయన పేర్కొన్నారు.

పెండ్లి ఊరేగింపులో నోట్ల వర్షం

రూ.20 లక్షల నోట్లు వెదజల్లిన వరుడి బంధువులు

లక్నో: పెండ్లి ఊరేగింపులో లక్షల రూపాయల నోట్ల వర్షం కురిసిన దృశ్యాలు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. యూపీలోని సిద్ధార్థనగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అష్టల్, అంజాన్‌ల పెండ్లి ఊరేగింపు సందర్భంగా వరుడి తరపు బంధువులు కొందరు ఇళ్ల పై అంతస్తు, డాబాపై నిలబడి ఊరేగింపుపై 500, 200, 100 రూపాయల నోట్లను కట్టలకు కట్టలు విడదీసి మరీ వెదజల్లారు. డబ్బును వెదజల్లడానికి వారు ఒక జేసీబీని కూడా వినియోగించడం విశేషం. దీంతో ఆ నోట్లను ఏరుకోవడానికి గ్రామస్తులు ఎగబడ్డారు. సుమారు 20 లక్ష రూపాయలను ఇలా వెదజల్లినట్టు వరుడి బంధువులు తెలిపారు.

ఉక్రెయిన్‌కు యాంటీ పర్సనల్ మైన్లు

- బైడెన్ సర్కారు మరో కీలక నిర్ణయం
- రష్యా దాడి భయాల నేపథ్యంలో కీవ్‌లోని అమెరికా ఎంబసీ మూసివేత

వాషింగ్టన్: ఇప్పటికే రష్యాపై దీర్ఘశ్రేణి క్షిపణుల ప్రయోగానికి ఉక్రెయిన్‌కు అనుమతి ఇచ్చి సంచలన నిర్ణయం తీసుకున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, మరో నిర్ణయంతో ఉద్రిక్త పరిస్థితులకు మరింత ఆజ్యం పోశారు. ఉక్రెయిన్‌కు తొలిసారిగా యాంటీ పర్సనల్ మైన్లను పంపడానికి బైడెన్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇది బైడెన్ పాలనలో మరో ప్రధాన విధాన, సంచలన నిర్ణయంగా భావిస్తున్నారు. ఉక్రెయిన్ రక్షణాత్మక ప్రాంతాలలో రష్యా దళాలు నెమ్మదిగా, నిదానంగా వస్తుండటంతో ఈ యాంటీ పర్సనల్ మైన్లను కీవ్ తమ దేశంలోని తూర్పు ప్రాంతంలో వినియోగించనుంది. యాంటీ పర్సనల్ మైన్లు లేదా యాంటీ పర్సనల్ లాండ్ మైన్లు (ఏపీఎల్)గా వ్యవహరించే వీటితో భారీగా సైనికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. అయితే ఈ యాంటీ పర్సనల్ మైన్లను తమ దేశ రక్షణకు తమ దేశ భూభాగంలోనే మాత్రమే వినియోగించాలని, వీటిని శత్రుదేశాలపై దాడికి ప్రయోగించరాదని బైడెన్ ప్రభుత్వం పేర్కొంది. అలాగే వీటి ద్వారా పౌరులకు జరిగే ప్రమాదాన్ని తక్కువకే పరిమితం చేస్తామని ఉక్రెయిన్ నుంచి హామీ పొందినట్టు అధికార వర్గాలు తెలిపాయి. అయితే విచక్షణా రహితంగా ప్రాణనష్టం కలిగించే యాంటీ పర్సనల్ మైన్స్ వినియోగాన్ని మానవ హక్కుల సంఘాలు చాన్నాళ్లుగా వ్యతిరేకిస్తున్నాయి. భూతల యుద్ధంలో ఇటీవల మాస్కో తీవ్రంగా నష్టపోతున్నది. ఈ వారంలో మాస్కో అత్యధిక సంఖ్యలో తన సైనిక బలగాలను కోల్పోయినట్టు వార్తలొస్తున్నాయి. అయితే మిత్రదేశమైన ఉత్తర కొరియా నుంచి దానికి సైనిక బలగాలతో పాటు, ఆయుధ సంపత్తి కూడా సమకూరుతుండటంతో ఉత్సాహాన్ని పుంజుకుంటున్నది. గత కొన్ని నెలలుగా కీవ్ చేస్తున్న విజ్ఞప్తుల మేరకు రష్యాపై దీర్ఘశ్రేణి అమెరికా క్షిపణులను ప్రయోగించడానికి ఇటీవల బైడెన్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం ఇప్పటికే అంతర్జాతీయంగా వివాదంగా మారింది.

అమెరికా దౌత్య కార్యాలయం మూసివేత

ఉక్రెయిన్-రష్యా యుద్ధం నేపథ్యంలో అమెరికా అప్రమత్తమైంది. కీవ్‌పై రష్యా వైమానిక దళాలు దాడి చేయవచ్చునన్న హెచ్చరికలతో అక్కడ ఉన్న తమ దౌత్య కార్యాలయాన్ని బుధవారం నుంచి తాత్కాలికంగా మూసివేసినట్టు అధికారులు తెలిపారు.

భూగర్భ జలాల అనుమతుల కోసం 'భూ-నీర్' పోర్టల్

న్యూఢిల్లీ, నవంబర్ 20: దేశంలో భూగర్భ జల నిర్వహణను మెరుగుపర్చేందుకు కేంద్రం కొత్తగా 'భూ-నీర్' పోర్టల్‌ను ప్రారంభించింది. ఇటీవల నిర్వహించిన 'ఇండియా వాటర్ వీక్-2024'లో కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్ పోర్టల్‌ను ప్రారంభించినట్టు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కేంద్రం తెలిపింది. దేశవ్యాప్తంగా భూగర్భ జలాల వినియోగంలో పారదర్శకత, సామర్థ్యం, స్థిరత్వాన్ని పెంచటం పోర్టల్ ఉద్దేశమని కేంద్రం తెలిపింది. భూగర్భ జలాల వినియోగం, వ్యాపారం, వ్యక్తిగత అనుమతులు.. తదితరమైన వాటి నిర్వహణ పోర్టల్ ద్వారా చేపడుతున్నట్టు వెల్లడించింది. అనుమతులు, చెల్లింపులు, దరఖాస్తుల స్థితి.. మొదలైనవి పోర్టల్ నుంచి పొందొచ్చునని, పాన్ ఆధారిత ఐడీ వ్యవస్థ, క్యూర్ కోడ్‌తో కూడిన ఎన్ఓసీ.. మొదలైన వాటితో డిజిటల్ విధానంలో ప్రక్రియ సాగుతుందని కేంద్ర జల శక్తి అధికారి ఒకరు చెప్పారు.

కాలిఫోర్నియాలోని కార్‌కోరన్‌లో టులె నది వరదలో మునిగిపోయిన కార్లు

అమెరికాలో బాంబ్ సైక్లోన్ బీభత్సం

ఒకరు మృతి..6 లక్షల ఇండ్లకు నిలిచిన విద్యుత్తు సరఫరా

వాషింగ్టన్: వాయువ్య అమెరికాలో మంగళవారం రాత్రి బాంబు సైక్లోన్ బీభత్సం సృష్టించింది. బలమైన గాలులు వీచడంతోపాటు భారీ వర్షాలు కురిశాయి. దీంతో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్లు నేల కూలడంతో ఇండ్లు దెబ్బతిన్నాయి. వాషింగ్టన్‌లోని లిన్‌వుడ్‌లో ఓ పెద్ద చెట్టు కూలిపోవడంతో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అత్యంత వేగంగా తీవ్రరూపం దాల్చిన ఈ భారీ తుపానును బాంబు తుపాను అని పేర్కొంది. శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియా, ఉత్తర కోస్తా, శాక్రమెంటో వ్యాలీలలో 20 సెంటీమీటర్ల వర్షం కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. శుక్రవారం వరకు నైరుతి ఒరెగావ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు రావచ్చునని సూచించింది. వాషింగ్టన్ స్టేట్‌లో బుధవారం ఉదయం 6 లక్షలకుపైగా ఇండ్లకు విద్యుత్తు సరఫరా లేదని వార్తలు వచ్చాయి.

ఇటలీలో 1 డాలర్‌కే ఇల్లు!

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ అనుసరించబోయే విధానాల పట్ల బెంగ పెట్టుకుని, దేశం నుంచి వెళ్లిపోవాలని కొందరు భావిస్తున్నారు. ఈ పరిస్థితిని ఇటలీలోని సార్డీనియా దీవి అధికారులు గొప్ప అవకాశంగా భావించారు. తక్కువ జనాభా ఉన్న తమ దీవికి రావాలని విదేశీయులకు వీరు ఆఫర్లు ఇస్తూ ఉంటారు. అందుకే, అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల వల్ల దిగ్భ్రాంతికి గురైనవారికి కూడా భారీ ఆఫర్‌ను ప్రకటించారు. శిథిలమైన ఇళ్లను అమెరికన్లకు కేవలం 1 డాలర్‌కే అమ్ముతామని తెలిపారు. అమెరికన్లను ఆకర్షించేందుకు ప్రత్యేకంగా ఓ వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించారు. నూతన అవకాశాలను పొందడంతోపాటు, మరింత సమతుల్యత గల జీవన శైలి కోసం చూస్తున్నారా? సార్డీనియా స్వర్గధామంలో మీ యూరోపియన్ జీవితాన్ని నిర్మించుకోవడం ప్రారంభించడానికి ఇదే సరైన సమయం! అని ప్రచారం చేస్తున్నారు.

ఉద్యోగులు డేటింగ్‌కు వెళ్తే క్యాష్ ప్రైజ్!

చైనా కంపెనీ ఆఫర్



న్యూఢిల్లీ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒంటరి ఉద్యోగులు ఇటు వ్యక్తిగత జీవితాన్ని, అటు వృత్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోలేక నానా తిప్పలు పడుతున్నారు. మరీ ముఖ్యంగా జీవితంలోని ఆనందాన్ని అనుభవించలేకపోతున్నారు. ప్రపంచం అంతటా ఈ సమస్య ఉన్నట్టే చైనాలో కూడా ఉంది. విజయమే లక్ష్యంగా పనిచేస్తున్న ఉద్యోగులు వ్యక్తిగత జీవితాన్ని విస్మరిస్తుండటంతో చైనా కంపెనీ వినూత్న ఆలోచనతో ముందుకొచ్చింది. ఒంటరి ఉద్యోగులు డేటింగ్‌కు వెళ్తే నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించింది. షెంజెన్‌కు చెందిన 'ఇన్‌స్టా360' అనే టెక్ కంపెనీ ఈ బంపరాఫర్ ప్రకటించింది. పార్ట్‌నర్‌ను పరిచయం చేస్తూ కంపెనీ డేటింగ్ ప్లాట్‌ఫాంపై పోస్టు పెడితే 66 యువాన్లు (దాదాపు రూ. 770) ఇస్తామని ప్రకటించింది. అంతేకాదు, ఆ బంధం విజయవంతంగా మూడు నెలలపాటు కొనసాగితే ఆ జంటతోపాటు వారిని కలిపిన వారికి 1,000 యువాన్లు (దాదాపు రూ.11,650) ఇస్తామని తెలిపింది. ఉద్యోగుల జీవితాల్లో సంతోషం నింపడంతోపాటు మనది అనే భావన పెంపొందించేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు కంపెనీ తెలిపింది. ఈ ప్రోత్సాహకం ప్రారంభించిన తర్వాతి నుంచి ఇప్పటి వరకు 500 పోస్టులు వచ్చినట్టు పేర్కొంది. ఇందుకు గాను 10 వేల యువాన్ల (దాదాపు రూ. 1.16 లక్షలు) ప్రోత్సాహకాలు అందించినట్టు వివరించింది. కంపెనీ ప్రకటించిన ఈ సరికొత్త ప్రోత్సాహకాలపై ఓ ఉద్యోగి మాట్లాడుతూ తన విషయంలో తన తల్లి కంటే కంపెనీయే ఆసక్తిగా ఉందని చమత్కరించాడు.

46.6 కోట్ల ఏండ్ల క్రితం భూమి చుట్టూ వలయాలు!

న్యూఢిల్లీ: సౌర కుటుంబంలో శని గ్రహం చుట్టూ వలయాలు ఉన్నట్టుగానే 46.6 కోట్ల సంవత్సరాల క్రితం భూమి చుట్టూ కూడా ఇలాంటి వలయాలు ఉండి ఉండొచ్చని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. ఆర్డోవిసియన్ కాలంలో ఈ వలయాలు ఉనికిలో ఉండొచ్చని 'ఎర్త్ అండ్ ప్లానెటరీ సైన్స్ లెటర్స్' జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంది. ఆ వలయాలే ఆ తర్వాత ఉల్కాపాతంగా మారి మాయమై ఉండొచ్చని అంచనా వేసింది. భూమిపై జరిగిన ఉల్కల దాడి తర్వాత టెక్టోనిక్ ప్లేట్లలో జరిగిన గణనీయమైన మార్పును అధ్యయనకారులు గుర్తించారు. ఉల్కలు ఢీకొట్టడం ద్వారా ప్రభావితమైన దాదాపు రెండు డజన్ల బిలాలను అధ్యయనం చేసిన అనంతరం అధ్యయనకారులు ఈ అంచనాకొచ్చారు. ఇవన్నీ భూమధ్య రేఖకు 360 డిగ్రీల లోపలే ఉండడం గమనార్హం.

జైళ్లలో రద్దీని తగ్గించేందుకు ఎలక్ట్రానిక్ ట్రాకిం